# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి 17 | సంచిక 314 | prajaaswaram9@gmail.com | పేజీలు 06 | వెల రూ. 1.00

Published from Telangana & Andhra Pradesh

బుధవారం, జులై 24, 2024


## శ్రీరాంసాగర్‌కు జలకళ

**భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు**

నిజాబాబాద్ : శ్రీరాంసాగర్ జలకళ సంతరించుకుంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువ మహారాష్ట్ర, గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు భారీ వరద పోటెత్తింది. ఎగువ నుంచి 21,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా ఔట్ ఎ÷-లో 532క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1069.50 అడుగులు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం.90.31 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 22.436 టీఎంసీలుగా ఉంది. అలాగే కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద స్వల్పంగా మొదలైందని అధికారులు తెలిపారు. ఇన్ ఎ÷-లో 715 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నది. 17 టీఎంసీల నీటి సామర్థ్యానికి ప్రస్తుతం మూడు టీఎంసీలుగా ఉంది. ఇక శ్రీశైలం జలాశయానికి 1,73,504 క్యూసెక్కుల వరద వస్తున్నది. 1,21,171 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 255 మీటర్ల వద్ద నీటిమట్టం ఉండగా, 58.59 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.



- 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్
- వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తూ నిర్ణయం
- నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి
- స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు
- మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు
- పన్ను ఆదాయంఅంచనా రూ.28.83 లక్షల కోట్లు
- ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా
- అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు
- అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయింపు
- పోలవరం పూర్తిచేసేందుకు వాగ్దానం
- బీహార్‌లో మౌళిక వసతుల కల్పనలకు భారీగా కేటాయింపులు
- బంగారం, ఫోన్స్ యాక్సరీస్‌పై సుంకాలు తగ్గింపు

# కొన్ని ఆశలు... మరికొన్ని ఆకాంక్షలు

కొన్ని మెరుపులు..మరికొన్ని విరుపులు.. కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలతో ఎప్పటిలాగే ఉద్యోగుల ఇన్‌కమ్ ట్యాక్స్‌పై పెద్దగా సడలింపులు లేకుండా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టారు. కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన-నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన-ఆవిష్కరణలు, తయారీ-సేవలు, తర్వాత తరం సంస్కరణలు- ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతూ.. ఈ అంశాలను ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టారు. న్యూఢిల్లీ,జూలై23(ప్రజాస్వరం):

2

## సివిల్ వివాదాలకు దూరంగా ఉండండి

హైదరాబాద్ : సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉండాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో నిర్వహించిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల ప్రత్యేక సమీక్ష సమావేశంలో సీపీ మాట్లాడారు. నేరాల నియంత్రణ, నేరస్థులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీటీవీ ఫుటేజీలను వినియోగించుకోవాలన్నారు. పాత నేరస్థుల కదలికపై నిఘా ఉంచాలని, స్టేషన్‌కొచ్చే వారితో మర్యాదతో మసలుకోవాలని హితవుపలికారు. మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా ఉండాలని.. డ్రగ్స్ సరఫరా, విక్రయంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. డీసీపీలు రాజే చంద్ర, ప్రవీణ్ కుమార్, కరుణాకర్, అరవింద్ బాబు, సునీతారెడ్డి, ఉషా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## విపక్షనేత కెసిఆర్‌కు ఛాంబర్

**స్పీకర్ తీరుపై కెటిఆర్ అసహనం**

హైదరాబాద్,జూలై23(ప్రజాస్వరం):

అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కేటాయించిన ఛాంబర్‌పై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశాల సందర్భంగా ఇన్నర్ లాబీలోని ఎల్‌వోపీ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తొలగించిన విషయం తెలిసిందే. ఔటర్ లాబీలో ఎల్‌వోపీకి ఛాంబర్ ఏర్పాటు చేశారు. రెండు రూమ్‌లు కలిపి ఒకే రూంగా అసెంబ్లీ సిబ్బంది మార్చేశారు. అయితే రూం మధ్యలో టాయిలెట్ పెట్టి వాడుకోవడానికి అనుకూలంగా లేకుండా చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఈ అంశాన్ని బీఏసీలో లేవనెత్తాలని మాజీ మంత్రి హరీష్‌రావుకు కేటీఆర్ సూచించారు. స్పీకర్‌ను కలిసి అభ్యంతరం వ్యక్తం చేయాలని కేటీఆర్ నిర్ణయించారు

## కెసిఆర్ అసెంబ్లీకి వస్తారా..రారా?

**ప్రస్తుతం రాజకీయా వర్గాల్లో ఇదే చర్చ**

**బిఆర్ఎస్ ఎల్పీ భేటీకి ఐదుగరు ఎమ్మెల్యేల డుమ్మా**

**మరో ఎమ్మెల్సీ చల్లా కూడా గైర్హాజరు**

5



## బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష..కక్ష



- తెలంగాణ పదం లేకుండానే బడ్జెట్
- పలుమార్లు ప్రధానికి కలిసి కోరినా గుండుసున్నా
- తెలంగాణపై ఉన్న కక్షను బయట పెట్టుకున్న మోడీ
- పోలవరం కోసం నిధులు ఇచ్చి...పాలమూరుకు ఇవ్వరా
- విభజన చట్టంలో తెలంగాణకు ఎందుకీ అన్యాయం
- తెలంగాణకు అన్యాయంపై అసెంబ్లీలో తీర్మానం
- పార్లమెంటులో ఎంపిలు నిరసన తెలియచేస్తాం
- కిషన్ రెడ్డి రాజీనామా చేసి నిజాయితీ నిరూపించుకోవాలి
- బడ్జెట్ కేటాయింపులపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

5

## 31వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ

**25వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి**

**బిఎసి సమావేశంలో సమావేశాల ఎజెండా ఖరారు**



3

## బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం

ఎపి, బీహార్‌ల కోసమే బడ్జెట్ పెట్టారు

మండిపడ్డ కాంగ్రెస్ తెలంగాణ ఎంపిలు

5



## నీట్ పరీక్ష పేపర్ లీక్ నిజమే

**కేవలం 155మంది మాత్రమే లబ్ది పొందారు**

**మళ్లీ పరీక్ష నిర్వహించడం కుదరదు**

**దీనిపై సిబిఐ విచారణ సాగుతోంది**

**సుప్రీం చీఫ్ జస్టిస్ట్ వైవి చంద్రచూడ్ స్పష్టీకరణ**

2



## బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

**ఒక్క కేటాయింపు కూడా లేకపోవడం దారుణం**

**ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా మిగిలింది సున్నా**

**స్వీయ అస్తిత్వమే మనకు శ్రీరామరక్ష అన్న కెటిఆర్**

2

# బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

**ఒక్క కేటాయింపు కూడా లేకపోవడం దారుణం**
**ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా మిగిలింది సున్నా**
**స్వీయ అస్తిత్వమే మనకు శ్రీరామరక్ష అన్న కెటిఆర్**

**హైదరాబాద్,జూలై23(ప్రజాస్వరం):**

తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈసారికూడా ఏమైనా భారీగా నిధులు కేటాయిస్తారని ఆశించాం.. దక్కింది శూన్యం అని కేటీఆర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ స్పందిస్తూ.. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. రూ. 48 లక్షలు ఇరవై ఒక్కవేల కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారు. తెలంగాణకు మరొకసారి దక్కింది గుండు సున్నానే అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టంలో దాదాపు 35 హామీల పైన నిర్ణయం తీసుకోవాలని గతంలో కేసీఆర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అనేకసార్లు అభ్యర్థిస్తూ లేఖలు కూడా రాశాం. ములుగు యూనివర్సిటీకి అదనపునిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ.. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేవటం లేదు అని కేటీఆర్ తెలిపారు. ఐఐఎం సహా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి కేంద్ర జాతీయ సంస్థలను ఇవ్వమని మేము కోరినప్పటికీ ఒక్కటి కూడా ఇవ్వలేదు. తెలంగాణ నుంచి ముంబై- నాగపూర్, బెంగళూరు- చెన్నై వంటి మార్గాల్లో పారిశ్రామిక కారిడార్లకు నిధులు అడిగినప్పటికీ వాటి గురించి స్పందన లేదు. మెగా పవర్ లూమ్ క్లస్టర్‌తో పాటు నూతన హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అడిగిన కూడా కేంద్రం స్పందించలేదన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు వెళ్లి ఢిల్లీలో అడిగిన వాటిని కూడా పట్టించుకోలేదు. తెలంగాణకు మరోసారి ఈ కేంద్ర బడ్జెట్ దక్కింది గుండు సున్నా. తెలంగాణలో 16 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి. 16 స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కి దక్కిన నిధులను చూసైనా తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలి. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అన్న విషయాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరముంది. ఎందుకు ప్రాంతీయ శక్తులను బలోపేతం చేసుకోవాలో మరోసారి ఈ బడ్జెట్ తెలియ జేస్తోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఒక్క మాట కూడా పార్లమెంట్‌లో మాట్లాడలేదు. ఇదే గులాబీ కండువా కప్పుకున్న ఎంపీలు పార్లమెంట్‌లో గనుక ఉంటే కేంద్ర వ్యతిరేక వైఖరిని గట్టిగా వ్యతిరేకించే వాళ్ళు. 8 మంది ఎంపీలను ఇచ్చినా బీజేపీ ప్రభుత్వం గుడ్డు సున్నా నిధులు ఇచ్చినందుకు తెలంగాణ ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారు. ఆంధప్రదేశ్‌కు నిధులు ఎక్కువ ఇచ్చినందుకు మాకు ఏం బాధ లేదు. సోదర రాష్ట్రంగా వారికి వచ్చిన కేటాయింపులపైన, వారు బాగుండాలని కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం పేరు చెప్పిన ప్రతిసారి ఎక్కడ కూడా తెలంగాణ ఆనే పదం ప్రస్తావించలేదు. రాజధాని అమరావతి కోసం, పోలవరంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తామని చెప్పారు. ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్లకు ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన భారీ నిధుల పట్ల మాకు ఎలాంటి దుగ్ధలేదు.. సంతోషమే. కానీ ఆంధప్రదేశ్, బీహార్‌కు మాత్రమే ఇచ్చి మిగిలిన 26 రాష్ట్రాలను చిన్న చూపు చూడడం నిజంగా బాధాకరం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం పేరు చెప్పిన మీరు తెలంగాణ రాష్ట్ర డిమాండ్లను మాత్రం పట్టించుకోలేదు అని కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# విద్యారంగానికి భారీగా కేటాయింపులు

**ఉన్నత విద్యకు 3శాతం వడ్డీతో రుణాలు**

**న్యూఢిల్లీ,జూలై23(ప్రజాస్వరం):**

విద్యాశాఖకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేసింది. విద్య, ఉద్యోగ, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాలకు చేయూతనిచ్చేందుకు ప్రత్యేకంగా పథకాలు ప్రకటించింది. మొత్తంగా 5 స్కీమ్‌లు అమలు చేస్తామని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. మొత్తంగా రూ.2 లక్షల కోట్ల కేటాయింపులు చేసింది. ఉద్యోగాల కల్పనకు సంబంధించి మొత్తం మూడు పథకాలు అమలు చేస్తామని తెలిపారు. నైపుణ్య శిక్షణపైనా దృష్టి సారించనున్నట్టు ప్రకటించారు. విద్యారంగానికి తోడ్పాటునిచ్చేందుకు వీలుగా దేశీయంగా ఉన్నత విద్య అభ్యసించే వాళ్లకు రూ. 10 లక్షల వరకూ లోన్ ఇస్తామని కీలక విషయం వెల్లడించారు. ఏటా అర్హులైన 25 వేల మంది విద్యార్థులకు ఈ రుణం అందించేలా ప్రణాళికలు రచించినట్టు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దేశీయ విద్యాసంస్థల్లో చదువుకునే వారికి మాత్రమే ఈ స్కీమ్ వర్తించనుంది. ఏటా లక్ష మంది విద్యార్థులకు 3శాతం వడ్డీతో రూ. 10 లక్షల రుణం అందిస్తామని స్పష్టం చేశారు నిర్మలా సీతారామన్. మహిళలపైనా ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. మోడల్ స్కిల్ లోన్ స్కీమ్ ద్వారా రూ.7.5 లక్షల వరకూ లోన్ ఇచ్చేలా భరోసా కల్పిస్తామని కేంద్రం ప్రకటించింది. ఏటా ఈ పథకం ద్వారా 25 వేల మందిలి లబ్ది చేకూరుస్తామని వెల్లడించింది.

# దొంగ పారిపోయిన ఘటన

**సూర్యాపేట,జూలై23(ప్రజాస్వరం):**

సూర్యాపేటజిల్లా గడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ శ్రీనివాసులను సస్పెండ్ చేశారు. ఇటీవల గరిడేపల్లి పోలీస్ స్టేషన్లో బ్యాటరీల దొంగతనం చేస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్లో ఉంచగా అతను పోలీసుల కన్నుగప్పి పారిపోయాడు. రెండు రోజులు అనంతరం అతను పోలీసులకు దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. కాగా, దొంగ పోలీస్ స్టేషన్ నుంచి పరారైన సమయంలో డ్యూటీలో ఉన్న వాచ్ కానిస్టేబుల్‌తో పాటు ఇతరులను హెడ్ కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

# అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు

**రైల్వేకోడూరు :** చిట్వేలి మండలం వెంకటరాజు పల్లి ఉన్నత పాఠశాలలో 2023-24 లో పదవ తరగతి నందు అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రధానం చేశారు. మంగళవారం ప్రధానోపాధ్యాయులు మనోహర్ బాబు, దాతల తల్లిదండ్రులు భాస్కర్, ధీమతి, శివయ్య, హరిత లు ప్రథమ స్థానం పొందిన వై. హర్షవర్ధన్(531) కు 60 వేలు, రెండవ స్థానం పొందిన పి. రాజశ్రీ(518) కి 30 వేలు, మూడవ స్థానం పొందిన కె. నితూషాకు(508) 20 వేల రూపాయల నగదును అందించారు.

# కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలు

**9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్**
**వ్యవసారంగానికి పెద్దపీట వేస్తూ నిర్ణయం**
**నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి**
**స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు**
**మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు**
**పన్ను ఆదాయంఅంచనా రూ.28.83 లక్షల కోట్లు**
**ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా**
**అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు**
**అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయింపు**
**పోలవరం పూర్తిచేసేందుకు వాగ్దానం**
**బీహార్‌లో మౌళిక వసతుల కల్పనలకు భారీగా కేటాయింపులు**
**బంగారం, ఫోన్స్ యాక్సరీస్‌పై సుంకాలు తగ్గింపు**



**న్యూఢిల్లీ,జూలై23(ప్రజాస్వరం):**

కొన్ని మెరుపులు..మరికొన్ని విరుపులు.. కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలతో ఎప్పటిలాగే ఉద్యోగుల ఇన్‌కమ్ ట్యాక్స్‌పై పెద్దగా సడలింపులు లేకుండా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టారు. కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కరణలు, తయారీ-సేవలు, తర్వాత తరం సంస్కరణలు- ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతూ.. ఈ అంశాలను ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టారు. తొమ్మిది సూత్రాల ఆధారంగా బడ్జెట్‌రూపకల్పన చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన, ఆవిష్కరణలు, తయారీ,సేవలు, తర్వాతతరం సంస్కరణలు.. ఈ తొమ్మిది సూత్రాల ప్రాధాన్యంగా తీసుకుని బడ్జెట్ రూపొందించినట్లు తన ప్రసంగంలో విత్త మంత్రి ప్రకటించారు. ఇక ఈ బడ్జెట్ మొత్తంలో వివిధ రంగాలన్నింటికి కలిపి రూ.48.21 లక్షల కోట్ల కేటాయింపులు చేశారు. అంటే స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు. ఇందులో మొత్తం ఆదాయాన్ని రూ.32.07 లక్షల కోట్లుగా, దానిలో పన్ను ఆదాయాన్ని రూ.28.83 లక్షల కోట్లుగా చూపించారు. ఈ ఏడాది ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా వేశారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా కట్టారు. అదేవిధంగా నూతన పింఛన్ విధానంలో త్వరలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో రైతులు,యువతపై ఎక్కువ దృష్టి పెట్టారు. యూత్ కు 2 లక్షల కోట్లు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. మొబైల్స్, బంగారంపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించారు. ఆదాయపు పన్ను శ్లాబులను సవరించారు. అయితే ఉద్యోగస్థులకు పెద్దగా ఉరట కల్పించలేక పోయారు. టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు 12 నెలల ఇంటర్న్ ఫిప్ అవకాశాలు కల్పించేనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్న్ షిప్ భత్యంగా నెలకు రూ.5000, వన్ టైమ్ అసిస్టెన్స్ కింద రూ. 6000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక కంపెనీలు ఇంటర్న్ షిప్ వ్యయంలో 12 శాతం భరించాల్సి ఉంటుంది. బీహార్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తామని నిర్మలా సీతారామన్ అన్నారు. బీహార్ లో విమానాశ్రయాలు, మెడికల్ కాలేజ్ లు, క్రీడల మౌలిక వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆందప్రదేశ్ రాష్ట్రాలను అభివృద్ధి పరుస్తామన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15000 కోట్లను కేటాయించారు. మొబైల్ ఫోన్లపై, యాక్సెసేరీలపై, ఛార్జర్స్ పై 15 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఉన్నత విద్య, దేశీయ సంస్థలకు రూ. 10 లక్ష ల కోట్లు కేటాయించారు. ఇకపోతే స్థూల జాతీయోత్పత్తి (జీడిపి) లోటు 4.9 శాతం ఉండగలదన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 4.5 శాతం ఆర్థిక లోటుకే చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. వచ్చే రెండేళ్లలో కోటిమంది రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కూరగాయల ఉత్పత్తి పెద్దఎత్తున చేపట్టేలా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా కేటాయింపులు చేశారు. ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు సేంద్రీయ వ్యవసాయంలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయంలో స్థిరమైన పద్ధతులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి పెంపుదలపై దృష్టి సారించామని.. ఆ దిశగా కార్యక్రమాలు చేపడతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.అంతేకాదు.. వాతావరణ పరిస్థితులను తట్టుకునే, అధిక దిగుబడినిచ్చే ఉద్యానవన పంటలకు సంబంధించి 109 కొత్త వంగడాలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యసాయ రంగానికి కేటాయించిన రూ. రాష్ట్రాల భాగస్వామ్యంతో ప్రభుత్వం వ్యవసాయానికి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రోత్సహిస్తుందని ప్రకటించారు. ఇక గ్రామీణాభివృద్ధి కోసం రూ. 2.66 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వ్యవసాయ ఉత్పాదతకు పెంపొందించడానికి, వాతావరణాన్ని తట్టుకోగల రకాలను అభివృద్ధి చేయడానికి వ్యవసాయ పరిశోధన శాలను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేస్తుందన్నారు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బ్జడెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. నూనెగింజల ఉత్పత్తి కోసం ఒక వ్యూహాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రైతుల ఆదాయం పెంచడం, వ్యవసాయ విలువను పెంచడం దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మద్దతుతో పంట అనంతర కార్యకలాపాలలో పెట్టుబడులను ప్రోత్సహించడం, పాడి రైతులకు సాధికారత, నానో-డీఏపిని అన్ని వ్యవసాయ-వాతావరణ మండలాలకు విస్తరించడం, 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కుల ఏర్పాటు, ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించడానికి బ్లూ ఎకానమీ 2.0 ప్రారంభం, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన అమలును వేగవంతం చేయడం, 11.8 కోట్ల మంది రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి. చిన్న రైతును దృష్టిలో ఉంచుకుని ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు. చిరు ధాన్యాలను పండించడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడంపైనా ఫోకస్ పెట్టింది.భారతదేశ వ్యవసాయ రంగం వారసత్వ సమస్యలలో కొట్టుమిట్టాడు తూనే ఉంది. ఇప్పటికీ దేశ జనాభాలో అధిక శాతం మంది ప్రజలు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయినప్పటికీ, వ్యవసాయం సమర్థత లోపించి తక్కువ ఆదాయ వృత్తిగా మిగిలిపోయింది. వ్యవసాయ ఉపాధి అవకాశాలను సృష్టించడంతోపాటు వాణిజ్యీకరణ, వైవిధ్యీకరణ దిశగా పయనించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. మధ్యతరగతి ప్రజలుపై ప్రధానంగా ఫోకస్ చేయడం జరిగిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశ వ్యాప్తంగా 4.1 కోట్ల మంది యువతీ, యువకులకు లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వం ఈ రంగాలపై దృష్టి సారిస్తుందని సీతారామన్ చెప్పారు. ఈ రంగాలలో పథకాలు, చర్యలు - ప్రస్తుతం ఉన్నవి, ప్రకటించబోయేవి అన్నింటికి కలిపి ఐదు సంవత్సరాల వ్యవధిలో రూ. 2 లక్షల కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఊనున్న ఐదేళ్లలో 20 లక్షలమందికి నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలకు అవసరమైన రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. భారతీయ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు 3 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తామన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న చేతివృత్తి మహిళలకు రుణ సాయం పెంచుతున్నట్లు ప్రకటించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్లు నూతన సిడిబీ బ్యాంకు బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎగుమతులు, ఎగుమతుల సేవలకు ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 500 పెద్ద కంపెనీల్లో కోటి మంది యువతకు ఉద్యోగాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు ఈ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో బుద్ధగయ, రాజ్‌గిర్, వైశాలి, దర్భంగాలలో రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. బీహార్‌లో వివిధ రహదారుల ప్రాజెక్టుల కోసం రూ.26,000 కోట్లను బడ్జెట్ ప్రతిపాదించింది. బీహార్‌కు బహుపాక్షిక అభివృద్ధి సంస్థల సహాయంతో ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని చెప్పారు. బీహార్‌లో విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. బీహార్‌లోని పీర్‌పైంటిలో 2400 మెగావాట్ల కొత్త పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ ప్రాజెక్టులను రూ.21,400 కోట్లతో చేపట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాష్ట్ర రాజధాని ఆవశ్యకతను గుర్తించి, బహుపాక్షిక ఏజెన్సీల ద్వారా ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 15,000 కోట్లు కేటాయించబడతాయన్నారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు నిధులు సమకూర్చి పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ క్రమంలో బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధప్రదేశ్‌ల సర్వతోముఖాభివృద్ధికి కేంద్రం 'పూర్వోదయ' పథకాన్ని కూడా తీసుకురానుంది. తూర్పు ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తుందని సీతారామన్ చెప్పారు.

## గద్వాల జిల్లాలో నేతన్న ఆత్మహత్య

జోగులాంబ గద్వాల : తెలంగాణలో పదేళ్ల తరువాత మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. గత ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను, నేతన్నలకు ఆర్డర్లను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తుండటంతో ఉపాధి లేక నేతన్నలు ఉరితాళ్లను ఆశ్రయిస్తున్నారు. తాజాగా జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో కాకే పరమేష్ (52) అనే చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో చేనేతకు అందించిన చేయూతను అర్ధాంతరంగా నిలిపివేయడంతోనే ఈ రంగం లో మరణమృదంగం మోగుతోందని నేతన్నలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే వర్క్ ఆర్డర్లు నిలిపివేయడం, చేనేత కార్మికులకు ఎలాంటి ప్రోత్సాహం అందించకపోవడంతో వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమగ్గాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించు కునేవారు చేతిలో పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడాల్సి వస్తున్నదని, కాంగ్రెస్ సర్కారు పరిపాల నా వైఫల్యం వల్లే ఈ సమస్యలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# డీలర్ల ఖాళీల భర్తీకి చొరవ

**కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యే**

**కామారెడ్డి,జూలై23(ప్రజాస్వరం):**

రేషన్ షాపులకు డీలర్లు లేక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. డీలర్‌కూడా బయోమెట్రిక్ పెట్టాలి. ఎవరి పేరిట షాపు ఉందో వారు బయోమెట్రిక్ చేస్తేనే ఆన్‌లైన్ ఓపెన్‌అవుతుంది. ఇన్‌చార్జి ఉన్న గ్రామాలతో పాటు, రెగ్యులర్‌గా ఉన్న గ్రామాల్లో ఒకే వ్యక్తి బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా బియ్యం పంపిణీకి ఆలస్యం అవుతోంది. ఇన్‌చార్జి ఉన్న షాపుల్లో 2, 3 రోజుల్లో బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ రోజుల్లో ఎవరైనా లబ్దిదారులు లేక పోతే రేషన్‌తీసుకునే విలులేదు. స్థానికంగా డీలర్ ఉంటే ఉదయం, సాయంత్రం లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. ఇటీవల పలు గ్రామాల ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే రంగంలోకి దిగి ఖాళీల భర్తీకి పూనుకున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న 42 రేషన్ షాపుల్లో డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. చాలా గ్రామాల్లో ఏళ్ల తరబడి ఈ సమస్య ఉండగా..లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌చార్జి డీలర్లతోనే నెట్టుకొస్తుండగా.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ను కలిసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో పౌరసరఫరాల అధికారులతో మాట్లాడిన కలెక్టర్ ఖాళీగా ఉన్న రేషన్ షాపుల వివరాలను తెలుసుకొని వెంటనే భర్తీ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం 489 మంది డీలర్లు ఉన్నారు. గతంలో నియమాకమయిన డీలర్ చనిపోవటం, కొందరు వివిధ కారణాలతో వదిలేయటం, అక్రమాలకు పాల్పడిన దృష్ట్యా కొందరిని గతంలో తొలగించటంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఖాళీగా ఉన్న గ్రామాల్లో పక్క గ్రామ డీలర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. కొన్ని షాపులకు 10 ఏళ్లుగా ఇన్‌చార్జి ఉంటున్నారు. స్థానికులు పలుమార్లు డీలర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో 2 నియోజక వర్గాలు వస్తాయి. ఈ డివిజన్లలో ఖాళీగా ఉన్న 42 షాపుల డీలర్ల భర్తీ కోసం ఆర్డీవోలు నోటిఫికేషన్ జారీ చేశారు. కామారెడ్డి డివిజన్లో 34, ఎల్లారెడ్డి డివిజన్లో 8 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. గ్రామాల వారీగా రిజర్వేషన్లను కూడా ప్రకటించారు. భిక్కనూరు మండలంలో 5, దోమకొండలో 2, కామారెడ్డిలో 8, పాల్వంచలో 2, రాజంపేటలో 5, రామారెడ్డిలో 5, సదాశివనగర్‌లో 4, తాడ్వాయిలో 3, ఎల్లారెడ్డిలో 2, లింగంపేటలో 1, నాగిరెడ్డిపేటలో 5 షాపుల భర్తీకి నోటిఫికేషన్? ఇచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. బాన్సువాడ రెవిన్యూ డివిజన్ పరిధిలో ని జుక్కల్, బాన్సువాడలో 47 షాపుల్లో కూడా త్వరలోనే భర్తీ చేయనున్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

# మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట





# అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ..

## రుణమాఫీ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, జులై 23 (ప్రజా స్వరం) :**

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీ జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు అందజేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద రుణమాఫీ పథకం అమలు తీరును స్వయంగా కలెక్టర్ రాహూల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూరుగుపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్‌లో 391 అకౌంట్లు ఉన్నాయనీ, ఇప్పటి వరకు 367 మంది రైతులకు రుణమాఫీ అమలైందని తెలిపారు. రైతు రుణమాఫీపై క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుని తద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. సంబంధిత రైతులకు రైతు రుణమాఫీ సొమ్ము చేరేలా బ్యాంకులు వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. రైతుల రుణ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలన్నారు. బకాయిలు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ జరుగుతుందన్నారు. రైతులు రుణమాఫీ జరగలేదని ఎవరు అధైర్య పడొద్దన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, బూరుగుపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి నాగమధురి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రవికాంత్‌రావు



**తొగుట, జులై23 (ప్రజా స్వరం) :**

తొగుట పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వి. రవికాంత్‌రావు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ డాక్టర్ బి. అనురాధను కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అనురాధ ఎస్ఐ రవికాంత్‌రావును అభినందించి, శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.



# పదోన్నతితో పెరిగిన బాధ్యత

**సంగారెడ్డి, జూలై 23,( ప్రజా స్వరం) :**

పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ సీహెచ్ రూపేష్ అన్నారు. జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో హెడ్ కానిస్టేబుల్‌స్‌గా విధులు నిర్వహిస్తున్న 18 మంది ఎస్ఐలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్పీ వారికి పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదోన్నతితో విధుల పట్ల మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ, అధికారులు పాల్గొన్నారు.

# కదిరే కృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలి



గజ్వేల్, జులై 23 (ప్రజా స్వరం) : సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కదిరే కృష్ణ మీద చర్యలు తీసుకోవాలని హైందవ సంఘాల ఐక్యవేదిక, హిందూ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద కదిరే కృష్ణ చిత్రపటం దహనం చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ బుక్క రమేశ్, పురోహితులు నంద బాలశర్మ, శేషం, శ్రీనివాస చార్యులు మాట్లాడుతూ హిందూ దేవతల మీద, కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరే కృష్ణను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే హిందువుల జోలికి, హిందూ దేవతల జోలికి ఎవరైనా వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైందవులు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం నిల్వల తనిఖీ

తూప్రాన్, జూలై 23 (ప్రజాస్వరం) : రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలను మంగళవారం ఆర్డీవో జయ చంద్రారెడ్డి పరిశీలించారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ శివారులో నవదుర్గ రైస్ మిల్లును తహశీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిల్వ ధాన్యం బస్తాలను తనిఖీ చేశామన్నారు. ఆయన వెంట సీఐ కృష్ణ, ఎస్ఐ శివానందం, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# అధ్వానంగా రహదారులు

## భారీ వర్షాలతో గుంతమయమైన ప్రధాన రహదారులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతు చేయించాలని వేడుకోలు

**వికారాబాద్, జూలై 23 (ప్రజా స్వరం):**

గత వారం రోజులుగా ఎడతెరపి లేకుండా వరుసగా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ప్రధాన రహదారులతోపాటు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయమై ప్రయాణికులను నరకయాతన పడుతున్నారు. వికారాబాద్ జిల్లాలో పలు మార్గాల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా తాండూరు నుంచి వికారాబాద్ వరకు ఉన్న 42 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో దాదాపు 30 కిలో మీటర్ల రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందంటే జిల్లాల్లో రోడ్ల తీరు ఎలా ఉందో అర్థం అవుతుంది. 2014లో ఈ రహదారి మరమ్మతులకు అప్పట్లో రూ.42 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేయగా.. అరకొరగా పనులు చేపట్టి కాంట్రాక్టర్ చేతులు దులుపుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ రహదారి మార్గంలో బాగుపడ్డ విషయం ఏమిటంటే మన్సాన్‌పల్లి వాగుపై కందనెల్లి వాగుపై రెండు బ్రిడ్జిల నిర్మాణం మాత్రమేనని పేర్కొంటున్నారు. గతంలో సింగల్ రోడ్డుగా ఉన్న తాండూరు వికారాబాద్ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా మార్చారు. అయితే కాంట్రాక్టర్ తనకు నష్టం వస్తుందని దాదాపు 5 కిలో మీటర్లు రోడ్డు పనులు అసలే చేపట్టలేదు. కేరెళ్లి నుంచి అనంతగిరి గుట్ట పైకి ఉన్న మార్గాన్ని మరమ్మతు చేయకుండా కాంట్రాక్టర్ వదిలిపెట్టారు. దీంతో కేరెళ్లి నుంచి అనంతగిరి గుట్ట వరకు ఉన్న దాదాపు మూడు కిలోమీటర్ల ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. అలాగే కేరెళ్లి నుంచి ధారూర్ వైపు ఉన్న మార్గంలో కూడా మరో రెండు కిలోమీటర్లు రోడ్ల మరమ్మతులు చేపట్టలేదు. అలాగే ధారూర్ నుంచి మన్‌సాన్‌పల్లి వరకు ఉన్న మార్గంలో కూడా ఐదు కిలోమీటర్ల మేర బీటీ పనులు రోడ్డుకి ఇరువైపులా మాత్రమే చేపట్టారు. మూడు లేయర్లుగా చేపట్టాల్సిన రోడ్డు పనులను కొన్నిచోట్ల ఒకటి రెండు లేయర్లు మాత్రమే.. అది కూడా రోడ్డుకు ఇరువైపు సగం మాత్రమే వేయడంతో రోడ్డు తీరు అధ్వానంగా తయారైంది. ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా రోడ్డు దుస్థితి వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణానికి అదనంగా రూపాయలు రూ.50 కోట్ల నిధులు తాజాగా ప్రభుత్వం మంజూరు చేయడంతో ఇప్పటికైనా ఈ రోడ్డు దుస్థితి మారుతుందా అని పలువురు సంశయం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామాలకు వెళ్లే రోడ్లు మరి దారుణం...**

గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ముఖ్యంగా తాండూరు పట్టణం నుంచి బషీరాబాద్ వెళ్లే మార్గంలో 23 కిలోమీటర్ల రహదారిలో 5 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉంది. లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా నుంచి వరకు ఉన్న ఐదు కిలోమీటర్ల రోడ్డు పూర్తి అధ్వానంగా ఉంది. ఏడాది క్రితం ఈ ఐదు కిలోమీటర్ల రోడ్డును బాగు చేసేందుకు కంకర వేసి వదిలిపెట్టడంతో ప్రస్తుత వర్షాలకు రోడ్డంతా గుంతల మయంగా మారింది. అలాగే మోమిన్ పేట మండల కేంద్రంలో ప్రధాన రహదారి అద్వాన్నంగా ఉంది. వికారాబాద్ నుంచి భూత్పూర్ నేషనల్ హైవే అనుసంధానంగా ఉన్న ఈ రహదారి పరిస్థితి అధ్వానంగా ఉండడం విడ్డూరం.






# నార్కోటిక్ శునకంతో వాహనాల తనిఖీ

**సంగారెడ్డి, జూలై 23, (ప్రజా స్వరం) :**

డ్రగ్స్ , గంజాయి సేవించిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీస్ జాని అనే (శునకం) ద్వారా సంగారెడ్డి రూరల్ పోలీసులు ప్రయోగం చేశారు. ఈ మధ్య కాలంలో తెలంగాణలో డ్రగ్స్, గంజాయి వినియోగం ఎక్కువైన విషయం తెలిసిందే. డ్రగ్స్, గంజాయి రహిత తెలంగాణ రాష్ట్రంగా మార్చేందుకు పోలీసులు అన్నీ విధాల కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమ్ఎన్ఆర్ మెడికల్ కాలేజ్ పరిసర ప్రాంతంలో సంగారెడ్డి జిల్లాకి కొత్తగా వచ్చిన పోలీస్ శునకం (జానీ) ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. డ్రగ్స్ సేవించిన వారిని గుర్తించడంతో పాటు వాహనాల్లో తరలిస్తే గుర్తుపడుతుందని, జాని నార్కోటిక్‌పై శిక్షణ పొందిందని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి రూరల్ ఎస్ఐ వినయ్‌కుమార్‌తో పాటు పోలీసులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో భారీ సైబర్ మోసం

**పటాన్‌చెరు, జూలై23, (ప్రజా స్వరం) :**



పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏ.పీ. ఆర్ హోమ్స్ లో నివాసముండే నాగార్జున (36) కు నదియా కామి అనే గుర్తుతెలియని మహిళ వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి స్టాక్ మార్కెట్ యాప్ లో ఇన్వెస్ట్ చేస్తే మంచి లాభాలు వస్తాయని చెప్పింది. ఇది నమ్మిన నాగార్జున 99,78,526.70 రూపాయలు ఆ యాప్ ద్వారా ఇన్వెస్ట్ చేశాడు. తర్వాత సదరు వ్యక్తుల నుండి ఎలాంటి సమాధానం లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి పటాన్ చెరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు, వెంటనే స్పందించిన సైబర్ క్రైమ్ పటాన్ చెరు పోలీసులు నిందితులకు సంబంధించి వివిధ అకౌంట్లో నుండి 24 లక్షలు రికవరీ చేశామని పటాన్ చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సిఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**తొగుట, జులై 23 (ప్రజా స్వరం) :**



అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండలం లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం లింగాపూర్ గ్రామానికి చెందిన చేపూరి ఆంజనేయులు గౌడ్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆంజనేయులుగౌడ్ గత కొద్దికాలంగా మహారాష్ట్రలో దేశిదారు దుకాణం నడుపుతుండేవాడు. ఆ దుకాణం సరిగా నడవక అప్పుల పాలయ్యాడు. గత రెండు సంవత్సరాల నుండి లింగాపూర్ గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలని బాధపడుతూ మద్యానికి బానిసై నిన్న భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. దీంతో భార్య భాగ్యలక్ష్మి తన అమ్మగారి ఇంటికి దౌలాపూర్ గ్రామం వెళ్లిపోయింది. తీవ్ర మనస్థాపానికి గురైన ఆంజనేయులు మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న తొగుట పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

## ఎస్పీ నారాయణ రెడ్డి


**వికారాబాద్, జూలై 23 (ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లాలో 31 కేసుల్లో సీజ్ చేసిన 104 కేజీల 530 గ్రాముల గంజాయిని వికారాబాద్ జిల్లా కోర్టు అదేశాల మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ గ్రామంలో ఉన్న మెడికర్ ఎన్విరాన్మెంటల్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కాల్చివేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎవరూ జిల్లాలో గంజాయి లేదా మత్తుకు అలవాటు పడొద్దని కోరారు. ముఖ్యంగా యువకులు చెడు లక్ష్యాలను కాకుండా మంచి లక్ష్యాలను అలవర్చుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు ముందు ఆనందాన్ని కల్గించినా చివరకు జీవితంలో విషాదన్నే మిగిలిస్తాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లపైన దృష్టి పెట్టి మత్తుపదార్థాలు ఇతర చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా చూడాలని, పోలీస్ డిపార్ట్‌మెంట్ తరుపున కూడా గంజాయి లాంటి మత్తు పదార్థాల రవాణా, వ్యాపారం, సేవించే వారిపైన దృష్టి పెట్టామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు లను ప్రోత్సహించిన, సేవించిన కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాల గురించి తెలిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అంతా కలిసి వికారాబాద్‌ను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, వికారాబాద్, పరిగి, తాండూర్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

## విద్యుత్ అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం

**వికారాబాద్, జూలై 23 (ప్రజాస్వరం):**



వికారాబాద్ జిల్లాలో వ్యవసాయ బోర్లు వేసుకున్న రైతులకు విద్యుత్ కలెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. వికారాబాద్ జిల్లాలో వ్యవసాయ రంగంలో విద్యుత్ సరఫరా పురోగతిపై విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కొడంగల్‌లోని కడ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకున్న రైతులకు నిర్ణీత గడువులోగా విద్యుత్ అందించాలన్నారు. రైతులు ఎంతో ఖర్చు పెట్టుకొని బోర్లు వేసుకున్నప్పటికీ సుదీర్ఘకాలంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్సిడీ వచ్చిన రైతులకు సమాచారాన్ని ఇచ్చి పనులు వేగవంతం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. రైతులు విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా ఆగస్టు 20లోపు పనులు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కనెక్షన్లపై కలెక్టర్ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధిదారులకు జీరో బిల్లు వస్తుందా? లేదా? అనేది తెలుసుకొని అర్హులందరికీ పథకం వర్తించేలా చొరవ చూపాలని ఏఈలకు సూచించారు. మున్సిపల్, మండలాల్లో నిర్వహించే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో వికారాబాద్ ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, కడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ సంజీవరెడ్డి, డీఈ సంజీవి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

**'కడ' కింద చేపట్టే పనులపై పవర్ ప్రజెంటేషన్...**

కడ కార్యాలయంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి కలెక్టర్ ప్రతీక్ జైన్ కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద చేపట్టే పనులను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు.

# నల్ల బెల్లం తరలిస్తున్న ముఠా పట్టివేత

**వికారాబాద్, జిల్లా 23 (ప్రజా స్వరం):**

నాటుసారా తయారీకి అవసరమైన నల్ల బెల్లాన్ని కర్ణాటక ప్రాంతంలో కొనుగోలు చేసి వికారాబాద్ జిల్లా ఓమ్లానాయక్ తండాకు తరలిస్తుండగా ఎక్సైజ్ డీటీఎఫ్ పోలీసులు పక్క సమాచారంతో పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రంలోని కుంచవరం అనే ప్రాంతం నుంచి ముగ్గురు వ్యక్తులు ఒక వ్యాన్‌లో 5180 కేజీల బెల్లాన్ని తరలిస్తున్న సమాచారంతో ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ భాస్కర్ గౌడ్, టీఎఫ్ ఎస్ఐ ప్రేమ్‌కుమారులు పట్టుకున్నారు. అక్రమంగా వ్యాన్‌లో తరలివెళ్తున్న వ్యాన్‌ను వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గ పెద్దేముల్ మండలం ఓమ్లానాయక్ తండా శివారులో మంగళవారం పట్టుకున్నారు. వ్యాన్‌లో 5180 కిలోల బెల్లంతోపాటు నాటు సారాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ భాస్కర్ తెలిపారు. కర్ణాటకలో రూ.40కిలో చొప్పున కొనుగోలు చేసిన ఈ బెల్లాన్ని తండాల్లో రూ.60 నుంచి 100 వేరకు అమ్మకాలు జరుపుతారని సమాచారం. సుమారు బెల్లం విలువ రూ. 4.14 లక్షల మేర ఉంటుందని, వ్యాన్ మరో రూ.రెండు లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ కేసులో రాథోడ్ పాండు నాయక్, రాథోడ్, ఓంసింగ్, రాథోడ్ సచిన్‌లను రిమాండ్ చేశారు. గతంలో పాండు అనే వ్యక్తి ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు రికార్డులో ఉందని పాండుపై రూ. 2 లక్షల జరిమానా వేసే అవకాశాలు పడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. బెల్లం అక్రమంగా రవాణ అవుతున్న వాహనాన్ని డీటీఎఫ్ ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌తో పాటు సిబ్బంది విష్ణు, హన్మంతు, శివ, రవికుమార్‌లు ఉన్నారు. వీరితోపాటు ఏఈఎస్ శ్రీనివాసరెడ్డి, తాండూరు సీఐ గంగాధర్ పాల్గొన్నారు.



# భూములు లాక్కోవడం సరికాదు

**మెదక్, జులై 23 (ప్రజా స్వరం) :**

అధికారం ఉందని గిరిజన రైతులపై దాడులు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం షాబాద్ గిరిజన తండాలో అధికార పార్టీ శ్రేణులు గిరిజనులపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న క్రాంతి కిరణ్ మంగళవారం మెదక్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనులను పరామర్శించారు. అనంతరం ఈ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులపై అక్కడి కాంగ్రెస్ శ్రేణులు దౌర్జన్యాలు చేస్తూ భూములు లాక్కుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారం ఉందని అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా అక్కడి పోలీసులు కండువాలు లేని కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి సర్వే చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# అందుబాటులో ఎరువులు

## జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు

**తూప్రాన్, జులై 23 (ప్రజా స్వరం) :**

రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు తెలిపారు. తూప్రాన్ పట్టణంలోని ఎరువులు దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు దుకాణంలో ఉన్న నిల్వ ఎరువులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎరువులు సరఫరా చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గంగమల్లు పాల్గొన్నారు.



# త్రిసభ్య కమిటీ సభ్యుడిగా నవీన్‌రెడ్డి

మేడ్చల్, జూలై 23 (ప్రజాస్వరం) : పార్టీ కోసం పనిచేసే వారికి తగిన ప్రాధ్యాన్యత దక్కుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జోష్ణ శివారెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి గౌడవెల్లి బాల్‌రెడ్డిలు అన్నారు. రాష్ట్రంలో బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా మద్యం కొనుగోలు ధరలను ఖరారు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీలో మేడ్చల్‌కు చెందిన ప్రముఖ ప్రాక్టీసింగ్ చార్టర్డ్ అకౌంటెంట్ రెడ్డమ్మగారి నవీన్‌రెడ్డిని సభ్యుడిగా నియమించడం అభినందనీయమన్నారు. మంగలశారం నవీన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికి సీఎం రేవంత్‌రెడ్డికి అవకాశం కల్పిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష..కక్ష

**తెలంగాణ పదం లేకుండానే బడ్జెట్**
**పలుమార్లు ప్రధానికి కలిసి కోరినా గుండుసున్నా**
**తెలంగాణపై ఉన్న కక్షను బయట పెట్టుకున్న మోడీ**
**పోలవరం కోసం నిధులు ఇచ్చి...పాలమూరుకు ఇవ్వరా**
**విభజన చట్టంలో తెలంగాణకు ఎందుకీ అన్యాయం**
**తెలంగాణకు అన్యాయంపై అసెంబ్లీలో తీర్మానం**
**పార్లమెంటులో ఎంపిలు నిరసన తెలియచేస్తాం**
**కిషన్ రెడ్డి రాజీనామా చేసి నిజాయితీ నిరూపించుకోవాలి**
**బడ్జెట్ కేటాయింపులపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు**

హైదరాబాద్,జూలై23(ప్రజాస్వరం):

కేంద్రం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ 2047 బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్ష తో పాటు కక్షను కూడా ప్రదర్శించారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతగా దగా జరగలేదన్నారు. తాము పలుమార్లు ప్రధానిని, కేంద్రమంత్రులను కలసి విన్నివించినా..ప్రధాని మోడీ పెద్దన్నగా అండగా ఉండాలని కోరినా తీవ్ర నిర్లక్ష్యం చూపారని మండిపడ్డారు. దీనిపై రేపటి శాసనసభలో కేంద్రానికి వ్యతిరేకంగా తీర్మానం చేస్తామని అన్నారు. అలాగే తమ నిరసనలు కొనసాగిస్తా మని అన్నారు. 8 సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజల పట్ల మోడీ కక్ష సాధింపు చర్యలకు దిగారని, ఇందుకు నిరసనగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మంత్రులు పొన్నం పరభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులతో కలసి కేంద్ర బడ్జెట్‌పై ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణ అనే పదాన్నే నిషేధించారని మండిపడ్డారు. 'మా ప్రభుత్వంలోని మంత్రులు 18 సార్లు దిల్లీకి వెళ్లారు. తెలంగాణకు అవసరమైన నిధులు ఇవ్వాలని స్వయంగా నేను ప్రధానికి విజ్ఞప్తి చేశా. కానీ, తెలంగాణ పదం పలకడానికి కేంద్రం ఇష్టపడటం లేదు. మొదటి నుంచి ప్రధాని మోదీ తెలంగాణ పట్ల కక్ష కట్టారు. ఇప్పటి వరకు ఆర్‌ఆర్‌ఆర్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఏ రంగానికీ సహకారం అందించలేదు. వికసిత్ భారత్‌లో తెలంగాణ భాగం కాదని ప్రధాని అనుకుంటున్నారు. బడ్జెట్‌లో బిహార్, ఏపీని మాత్రమే పట్టించుకున్నారు. ఇతర రాష్ట్రాలను పట్టించుకోలేదు. 8 సీట్లు ఇచ్చి తెలంగాణ ప్రజలు భాజపా పట్ల వివక్ష చూపలేదు. 8 సీట్లు ఇవ్వడం వల్లే మోదీ ప్రధాని కుర్చీలో ఉన్నారు. తెలంగాణకు ఐఐఎం ఇవ్వలేమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ రాశారు. అలాంటప్పుడు కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఎందుకు కొనసాగుతున్నారు? కేంద్రమంత్రి పదవి కోసం కిషన్‌రెడ్డి.. తెలంగాణ హక్కులను మోదీ వద్ద తాకట్టుపెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు. పోలవరానికి నిధులిచ్చిన కేంద్రం.. పాలమూరు-రంగారెడ్డికి ఎందుకు నిధులు ఇవ్వట్లేదు?తెలంగాణపై కేంద్రం చూపించే వివక్ష మంచిది కాదు'అని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపిందని మండిపడ్డారు. తెలంగాణపై కేంద్రం కక్ష సాధించినట్లుందని.. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ' ప్రధాని తెలంగాణకు వస్తే స్వాగతం పలికి పెద్దన్న పాత్ర పోషించమని అడిగాను. పెద్దన్నలా ఉండాల్సిన ప్రధానికి ఇది సరికాదు. ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని నిధులు అడిగాం. ప్రధాని మోదీని నేనే మూడుసార్లు కలిసి అడిగాను. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను మెరుగుపరుద్దామని ప్రధానితో చెప్పాను. అయినా తెలంగాణకు అన్యాయం జరిగింది. మా మంత్రులు కూడా కేంద్ర మంత్రులను కలిశారు. 18 సార్లు ఢిల్లీ వెళ్లి నిధులు ఇవ్వాలని కోరాం.. తెలంగాణ ఏర్పాటు పట్ల మోదీకి ఉన్న కక్షను మరోసారి చాటారు' అని రేవంత్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏపీకి ఎన్నిరకాలుగా కేటాయింపులు చేయాలో అన్ని రకాలుగా కేటాయించారు. ఏపీకి ఎందుకు నిధులు ఇస్తున్నారు..? అని మేం అడగడం లేదు. పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్టు ఏపీకి నిధులు కేటాయించారు. తెలంగాణ విషయంలో ఇంత కక్ష ఎందుకు?. గుజరాత్‌కు ఎలా నిధులు కేటాయించారో,మూసీకి అలా నిధులు కేటాయించామని ప్రధాని మోదీని అడిగాను. హైదరాబాద్‌కు నిధులు ఇస్తే దేశ ఎకానమికి ఉపయోగపడుతుందని మోదీకి వివరించాను. పదేండ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఐటీఐఆర్ కారిడార్ మరుగున పడింది. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ స్లోగన్ బోగస్ అని బీజేపీ నిరూపించింది. వికసిత్ భారత్‌లో మా రాష్ట్రం ఉండదా?' అని కేంద్రంపై రేవంత్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'కేంద్ర బడ్జెట్ కుర్చీ బచావో బడ్జెట్‌లాగా ఉంది. ఇంత కక్షపూరిత బడ్జెట్ గతంలో ఎప్పుడూ లేదు. తెలంగాణ ఓట్లు, సీట్లు మాత్రమే బీజేపీకి కావాలని ఎన్నికల ముందే చెప్పాను. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత వహించి మోదీ మంత్రివర్గం నుంచి తప్పుకోవాలి. ప్రతి రాష్ట్రంలో ఐఐఎం ఉంది. తెలంగాణకి ఇవ్వండి అని లేఖ రాశాను. తెలంగాణకు ఐఐఎం ఇవ్వము అని ధర్మేంద్ర ప్రధాన్ మూడు రోజుల క్రితం లేఖ రాశారు. కేంద్ర బడ్జెట్ ఏపీ, బీహార్ కోసమే పెట్టినట్టు ఉంది. కుర్చీ లాలూచీలో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. మా ఎంపీలతో పార్లమెంట్‌లో నిరసన తెలియచేస్తాం. తెలంగాణకి అన్యాయం జరుగుతుంటే తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు చూస్తూ ఊరుకోరు. ఏపీ పునర్విభజన చట్రంలో ఏపీకి ఇవ్వాల్సిన అంశాలతో పాటు తెలంగాణకి ఇవ్వాల్సిన అంశాలు ఉన్నాయి. బడ్జెట్ సవరించే అవకాశం ఉంది. బడ్జెట్ సవరించి మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఫార్మా విలేజ్ నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలి. బీజేపీ చేతకానీ తనం, బానిస మనస్తత్వం వల్ల తెలంగాణ అన్యాయం అవుతోంది' అని కేంద్రంపై రేవంత్ మండిపడ్డారు.

## గృహ నిర్మాణాలకు ప్రోత్సాహం

**10లక్షల కోట్లతో కోటిమందికి ప్రయోజనం**
**ముద్రా రుణాల పరిమితిని పెంచుతూ నిర్ణయం**

న్యూఢిల్లీ,జూలై23(ప్రజాస్వరం):

సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే పట్టణ పేదలు, మధ్యతరగతి జీవులకు బడ్జెట్ 2024-25లో కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0' పథకం కింద ఏకంగా కోటి మందికి గృహ రుణాలు ఇవ్వనున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మొత్తం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడితో 1 కోటి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ప్రయోజనాన్ని అందించనున్నట్టు వివరించారు. పట్టణ ప్రజల గృహ అవసరాలను గుర్తించామని, ఈ మేరకు అర్బన్ హౌసింగ్ ద్వారా సమస్యను పరిష్కరించనున్నట్టు వివరించారు. ఈ పథకం కింద రానున్న ఐదు సంవత్సరాల్లో మరో రూ. 2.2 లక్షల కోట్లు కేంద్ర సాయం అందుతుందని ఆమె చెప్పారు. మరోవైపు ముద్ర పథకం కింద రుణ పరిమితిని కూడా పెంచుతున్నట్టు సీతారామన్ ప్రకటించారు. అంతేకాకుండా చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు మరింత సులభంగా ఆర్థిక సాయాన్ని పొందేలా మార్గదర్శకాలు రూపొందిస్తామని సీతారామన్ స్పష్టం చేశారు. తద్వారా కొత్త వ్యాపారాలను ప్రారంభించేందుకు లేదా విస్తరించేందుకు వీలు కల్పిస్తామని, ఆర్థిక వృద్ధికి, ఉద్యోగ కల్పనకు కేంద్రం దోహదపడుతుందని సీతారామన్ వివరించారు. కాగా రికార్డు స్థాయిలో సీతారామన్ వరసుగా ఏడవసారి కేంద్ర బ్జడెట్ 2024-25ను ప్రవేశపెట్టారు. మొత్తం రూ.48.21 లక్షల కోట్లు బ్జడెట్‌ను ప్రకటించారు. మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు, పన్ను ఆధారిత ఆదాయం రూ.28.83 లక్షల కోట్లు, ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని బ్జడెట్‌లో కేంద్రం అంచనా వేసింది. ఇక అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ16 లక్షల కోట్లుగా లెక్కగట్టింది.

## బంగారం, వెండిలపై సుంకం తగ్గింపు

**భారీగా తగ్గిన బంగారం ధరలు**
**బడ్జెట్ ప్రకటనతో 4వేలు తగ్గిన బంగారం**




హైదరాబాద్,జూలై23(ప్రజాస్వరం) :

ఎన్డీయే ప్రభుత్వం మూడో దఫా తొలి బడ్జెట్‌లో బంగారం, వెండికి సంబంధించి కస్టమ్స్ డ్యూటీని భారీగా తగ్గించారు. దీంతో బంగారం ధర ఒక్కసారిగా పడిపోయింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం ముగిసే సమయానికి బంగారం ధర 10 గ్రాములకు దాదాపు రూ.4000 తగ్గింది. ముంబైలో బంగారం ధర రూ.3531 తగ్గింది. పూణెలో బంగారం ధర రూ.3526 తగ్గింది. జలగావ్‌లో బంగారం ధర 3వేలు తగ్గింది. గోండియాలో బంగారం ధర రూ.400, వాషిమ్‌లో రూ.2800 తగ్గింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు బ్జడెట్‌లో బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతో బంగారం, వెండి చౌకగా మారాయి. ఎందుకంటే దానిపై కస్టమ్స్ సుంకాన్ని 6శాతానికి తగ్గించారు. ఆ ప్రభావం వెంటనే బంగారం ధరలపై పడింది. బంగారం ధర రూ.4,000 తగ్గగా, వెండి ధర కూడా గణనీయంగా పడిపోయింది. ఓఅచీలో గోల్డ్ ఫ్యూచర్స్ ట్రేడింగ్ సమయంలో, మంగళవారం 10 గ్రాములకు రూ.72,850 స్థాయిని తాకింది. బంగారంపై కస్టమ్ డ్యూటీ తగ్గింపు ప్రకటన తర్వాత బాగా పడిపోయింది. ఇప్పుడు బంగారం ధర 10 గ్రాములు రూ.68,500 స్థాయికి చేరుకుంది. ఇది కూడా చదవండి: ఃబీటణఃబి 2024: ఐదు కిలోల ఉచిత రేషన్ గడువు పెంపు.. ఎందుకో తెలుసా? ఓ వైపు బంగారం ధర తగ్గగా, మరోవైపు వెండి ధర కూడా పడిపోయింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో వెండి ధర రూ.89,015కి చేరగా, అకస్మాత్తుగా రూ.4,740 తగ్గింది. ఇప్పుడు కిలో వెండి ధర రూ.84,275 తగ్గింది.ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు. ప్రాథమిక కస్టమ్ డ్యూటీ 5 శాతం, అగ్రి ఇన్‌ఫ్రా అండ్ డెవలప్‌మెంట్ సెస్ 1 శాతం. ఇది కాకుండా, ఎ÷-లాటినంపై ఇప్పుడు సుంకాన్ని 6.4 శాతానికి పెంచారు. దిగుమతి చేసుకునే ఆభరణాలపై కస్టమ్స్ సుంకాన్ని కూడా తగ్గించారు. బంగారం,వెండిపై కస్టమ్స్ సుంకం 6శాతానికి తగ్గించారు. ఇది దేశీయ ధరలను కూడా తగ్గించవచ్చు. ఇది బంగారం డిమాండ్‌ను పెంచుతుంది.

## 31వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ

**25వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి**
**బిఎసి సమావేశంలో సమావేశాల ఎజెండా ఖరారు**



హైదరాబాద్,జూలై23(ప్రజాస్వరం):

ఈ నెల 31వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. 25వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 26, 28 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 31వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలుపనుంది. బుధవారం పంటల రుణమాఫీపై చర్చ జరగనున్నట్లు సమాచారం. అలాగే జాబ్క్యాలెండర్‌పైనా కూడా చర్చ జరుగనుంది. బీఏసీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు, బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నుంచి బలాల హాజరయ్యారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపట్ల శాసనసభ ఇవాళ సంతాపం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆమె మృతికి సంతాపంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం

**ఎపి, బీహార్‌ల కోసమే బడ్జెట్ పెట్టారు**
**మండిపడ్డ కాంగ్రెస్ తెలంగాణ ఎంపిలు**

న్యూఢిల్లీ,జూలై23(ప్రజాస్వరం):

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారని కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణలు అన్నారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల కోసమే బడ్జెట్ పెట్టినట్లు ఉందని విమర్శించారు. వాళ్ల ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే రెండు రాష్ట్రాలకు కేటాయింపులు చేశారని మండిపడ్డారు. ఢిల్లీ వేదికగా మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ... విభజన చట్టం గురించి చాలసార్లు ప్రస్తావించారు కానీ తెలంగాణ అన్న పదం కూడా వాడలేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్ మినహా 9 జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా గుర్తించినప్పటికి తెలంగాణకు కేటాయింపులు లేవని.. ఈవిషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించడంలో తమకు అభ్యంతరం లేదు, కానీ తెలంగాణకు కేటాయింపులు లేకపోవడం బాధాకరమని చెప్పారు. పాలమూరు జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తిచేయాలని సీఎం, మంత్రులు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదని అన్నారు. విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల ప్రస్తావన లేకపోవడం దారుణమని మండిపడ్డారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని, ఇద్దరు మంత్రులు ఉన్నారు అయిన తెలంగాణకు దక్కింది ఏం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎంపీలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలని అన్నారు. తెలంగాణ హక్కుల సాధనకు అందరూ ఎంపీలు కలిసికట్టుగా పోరాడేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఎంఐఎం ఎంపీలను కలిసి ఉమ్మడి పోరటాలపై చర్చిస్తామని తెలిపారు. తెలంగాణ హక్కుల సాధనకు అలుపులేని పోరాటం చేస్తామని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. తెలంగాణకు కేటాయింపుల్లో కేంద్రంలోని బీజేపీ పూర్తిగా విఫలమైందన్నారు వంశీకృష్ణ. తెలం గాణ ప్రజలకు బీజేపీ ఎంపీలను సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన హామీలపై ఎలాంటి కేటాయింపులు లేవని అన్నారు. బ్జడెట్ లో తెలంగాణ విభజన హామీల ప్రస్తావన లేకపోవడం బాధాకరం అన్నారు. గత పదేండ్లలో బీజేపీ, బీఆర్ ఎస్ లు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయన్నారు ఎంపీ వంశీకృష్ణ. మంగళవారం ప్రవేశపెట్టిన బ్జడెట్? పూర్తి పొలిటికల్ బ్జడెట్ అ న్నారు ఎంపీ వంశీకృష్ణ.బీజేపీకి మద్దతిస్తున్నందుకే ఆంధప్రదేశ్,బీహార రాష్ట్రాలకు నిధులు వరద పారించారన్నారు. దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోయిం దన్నారు. బడ్జెట్ లో యువతను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పార్లమెంట్ లో కొట్లాడి తెలంగాణకు నిధులు తెస్తామన్నారు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ.

## నీట్ పరీక్ష పేపర్ లీక్ నిజమే

**కేవలం 155మంది మాత్రమే లబ్ది పొందారు**
**మళ్లీ పరీక్ష నిర్వహించడం కుదరదు**
**దీనిపై సిబిఐ విచారణ సాగుతోంది**
**సుప్రీం చీఫ్ జస్టిస్ట్ వైవి చంద్రచూడ్ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ,జూలై23(ప్రజాస్వరం):

నీట్ ప్రశ్నపత్రం లీకైన మాట వాస్తవమేనని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. నీట్ అంశంపై విచారణ ముగియడంతో సీజేఐ ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. నీట్ మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఝార్ఖండ్‌లోని హజారీబాగ్, బిహార్‌లోని పట్నాలోని కేంద్రాల్లో నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకైందన్న మాట వాస్తవం. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం దాదాపు 155 మంది విద్యార్థులు లీక్ వల్ల లబ్దిపొందినట్లు తెలుస్తోంది. ఈ విద్యార్థులపై చర్యలు తీసుకోవాలి. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నదని చెప్పేందుకు సరైన ఆధారాలు లేవు. వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైందని నిర్ధారణకు రావడం ప్రస్తుత దశలో కష్టం. మళ్లీ పరీక్ష పెడితే 24 లక్షల మంది ఇబ్బంది పడతారు. వారిలో అనేకమంది వందల కి.మీల దూరం ప్రయాణం చేసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఇంత మంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే 'ఫిజిక్స్ వాలా' విద్యాసంస్థ వ్యవస్థాపకుడు అలఖ్ పాండేతో పాటు మరి కొందరు దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఇవాళ తీర్పు వెలువరించింది.

## కెసిఆర్ అసెంబ్లీకి వస్తారా..రారా?

**ప్రస్తుతం రాజకీయా వర్గాల్లో ఇదే చర్చ**
**బిఆర్ఎస్ ఎల్పీ భేటీకి ఐదుగురు ఎమ్మెల్యేల డుమ్మా**
**మరో ఎమ్మెల్సీ చల్లా కూడా గైర్హాజరు**



హైదరాబాద్,జూలై23(ప్రజాస్వరం):

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా..? లేదా..? అన్నది హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ సారి అసెంబ్లీకి వస్తారని జోరుగా ప్రచారం జరిగింది. మంగళవారం సమావేశాలు ప్రారంభమయ్యాయి. బీఏసీ సమావేశానికి ఆయనే హాజరవుతారని అంతా భావించారు. అయితే బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. సమావేశాల ఎజెండాపై చర్చించారు. అయితే కేసీఆర్ మాత్రం మధ్యాహ్నం తర్వాత తెలంగాణ భవన్ లో జరిగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశానికి హాజరై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. కొందరు పార్టీ నేతలు మాత్రం బడ్జెట్ రోజు అసెంబ్లీకి వస్తారని చెబుతున్నారు. అయితే హరీశ్ రావు మీడియాతో చేసిన చిట్ చాట్ లో కేసీఆర్ అసెంబ్లీకి వస్తారో లేదో..? చెప్పం.. అది మా స్ట్రాటజీ అంటూ దాటవేశారు. మధ్యాహ్నం తర్వాత తెలంగాణ భవన్ లో ఎల్పీ మీటింగ్ నిర్వహించిన కేసీఆర్ తొమ్మిది అంశాలపై సభలో చర్చించాలని సూచించారు. అయితే ఈ సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అనారోగ్యం కారణంగా గైర్హాజరయ్యారు. ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ఆలస్యంగా సమావేశానికి వచ్చారు. స్వయంగా పార్టీ చీఫ్ కేసీఆర్ హాజరైన సమావేశానికి ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు డుమ్మా కొట్టడం బీఆర్ఎస్ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఎల్పీ సమావేశానికి గైర్హాజరైన వారిలో కొందరు పార్టీ మారబోతున్నట్లు గత కొంత కాలంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ అధ్యక్షన జరిగిన బీఆర్ ఎస్ ఎల్పీ సమావేశానికి ఎమ్మెల్యేలు మాణిక్యరావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ గౌడ్ తోపాటు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి డుమ్మాకొట్టారు. సమావేశానికి హాజరుకాని వారు పార్టీ మారుతున్నారా ఏంటీ అనే సందేహాలు, చర్చ మొదలైంది.

## అసెంబ్లీ సమావేశాలు కుదించడం సరికాదు

**తక్కువ రోజులు ఉన్నప్పుడు ముందే ప్లాన్ చేయాలి**
**బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

హైదరాబాద్,జూలై23(ప్రజాస్వరం):

అసెంబ్లీలో మాట్లాడాలంటే ఎందుకు జంకుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ఫైర్ అయ్యారు. ప్రతిపక్షాల గొంతు వింటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ప్రతిపక్షాల దాడి నుంచి తప్పించుకునేందుకే నాలుగు రోజులు అసెంబ్లీ రన్ చేస్తున్నారని ఆరోపించారు. డిమాండ్స్ పై మూడు రోజులు మాత్రమే డిస్కషన్స్ పెట్టారు. 31 లోపు ద్రవ్య వనిమయ బిల్లు పాస్ కావాలంటే బడ్జెట్ సమావాఏశాలు ముందు పెట్టాలని తెలీదా? అని ప్రశ్నించారు. మూడు, నాలుగు రోజులు బడ్జెట్ సెషన్ పెట్టడం అప్రజాస్వామికమన్నారు. మేం 18 అంశాలు వారి దృష్టికి తీసుకెళ్లాం. అందులో ఒకటి, రెండు అంశాలే చర్చకు వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యవసాయం, ఇరిగేషన్, సాగు నీరు, ఉద్యోగాల ఖాళీలు, విద్యా రంగ సమస్యలు, ఇలా 18 రోజులు రోజుకి ఒక్క అంశం మీద చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పునాదుల మీద నడుస్తున్నదని విమర్శించారు. కాగా, ఈ నెల 31వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. 25వ తేదీన బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. 26, 28 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 31వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలుపనుంది. రేపు పంటల రుణమాఫీపై చర్చ జరగనున్నట్లు సమాచారం.









# ఎన్టీఆర్ మంచి డ్యాన్సర్

**కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ ప్రశంసలు**

ఎన్టీఆర్ అద్భుతమైన డ్యాన్సర్ అంటూ ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ ప్రశంసలు కురిపించారు. తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఎదురైన ప్రశ్నకు సమాధానమిస్తూ ఆ హీరోను కొనియాడారు. ఎన్టీఆర్‌తో కలిసి పనిచేయడంపై ఆనందాన్ని వ్యక్తంచేశారు. 'దేవర'లోని ఓ గీతానికి నేను నృత్యరీతులు సమకూర్చా. అందులో క్లిష్టమైన స్టెప్పుల్లేవు. చాలా సింపుల్‌గా కంపోజ్ చేశా. ఎన్టీఆర్ స్వీట్ డ్యాన్స్ అదిరిపోతుంది. మీరంతా తప్పక ఎంజాయ్ చేస్తారు' అని అభిమానుల్లో ఆసక్తి రేకెత్తించారు. బాస్కో- సీజర్ ద్వయానికి సినీ అభిమానుల్లో విశేషమైన క్రేజ్ ఉండేది. 'జిందగీ నా మిలేగీ దొబారా'లోని సెనోరిటా పాటకుగానూ 2011లో ఈ ద్వయం జాతీయ అవార్డు అందుకుంది. తెలుగులో 'శ్రీమంతుడు', 'ధ్రువ' తదితర చిత్రాల్లోని పాటలకు కొరియోగ్రఫీ చేశారు. 2016 నుంచి వారిద్దరూ వేర్వేరుగా పని చేస్తున్నారు. ఓవైపు కొరియోగ్రాఫర్‌గా సాగుతూనే 'రాకెట్ గ్యాంగ్' చిత్రంతో దర్శకుడిగా మారారు బాస్కో. ఇటీవల విడుదలై నెట్టింట ట్రెండింగ్‌లో నిలిచిన 'తోబా తోబా' (బ్యాడ్ న్యూజ్) సాంగ్ బాస్కో కొరియోగ్రఫీ చేసిందే. చాలాకాలం తర్వాత తెలుగులో 'దేవర'కు వర్క్ చేశారు. త్వరలోనే ఆ పాట రిలీజ్ కానుంది. ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న పాన్‌ఇండియా చిత్రమిది. జాన్వీ కపూర్ హీరోయిన్. తొలి భాగం సెప్టెంబరు 27న ప్రేక్షకుల ముందుకురానుంది.

# వరుస సినిమాలతో మీనాక్షి జోరు



మిస్ ఇండియా మీనాక్షి చౌదరి స్పీడ్ చూస్తుంటే.. వచ్చే ఏడాదికి టాప్ హీరోయిన్ అయి కూర్చునేలా ఉంది. ఆమె లైనప్ అలా ఉంది మరి. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుపెట్టిన ఈ అందాలభామ.. రెండో సినిమా 'హిట్ 2'తో హిట్ అందుకున్నది. అక్కడి నుంచి అవకాశాలు ఈ ముద్దుగుమ్మకి క్యూ కట్టాయి. తమిళ అగ్రహీరో విజయ్‌కు జోడీగా తాను నటించిన పాన్‌ఇండియా సినిమా సెప్టెంబర్ 5న విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్‌కు జోడీగా నటించిన 'లక్కీభాస్కర్' సెప్టెంబర్ 7న విడుదల కానుంది. విశ్వక్‌సేన్‌తో జతకట్టిన 'మెకానిక్ రాకీ' అక్టోబర్ 31న రానుంది. వెంకటేశ్, అనిల్ రావిపూడిల సినిమాలో కూడా మీనాక్షి చౌదరే కథానాయిక. వీటితోపాటు వరుణ్‌తేజ్ 'మట్కా'. ఈ లైనప్ గురించి మీనాక్షిని అడిగితే 'అంతా గాడ్ గ్రేస్. పైగా చేస్తున్నవన్నీ పాన్ ఇండియా సినిమాలే. ఓ వైపు ఆనందంగా.. మరోవైపు భయంగా ఉంది. అటు యంగ్‌స్టర్స్‌తోనూ, ఇటు సీనియర్ హీరోలతోనూ చేసే ఛాన్స్ బహుశా నాకే దక్కిందేమో..' అంటూ ఆనందం వెలిబుచ్చింది మీనాక్షి చౌదరి.

# పాత్రకు ప్రాధాన్యం ఉన్న పాత్రలనే చేస్తా: నటి అంజలి

వరుస సినిమాలు, వెబ్‌సిరీస్‌లతో అలరిస్తున్నారు నటి అంజలి. తాజాగా 'బహిష్కరణ' సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే ఇందులోని ఇంటిమేట్ సీన్స్‌పై స్పందించారు. 'కెరీర్ ప్రారంభం నుంచే నాకు మంచి పాత్రలు వచ్చాయి. నా పాత్రకు ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్ట్‌లనే ఎంచుకున్నాను. ప్రతీ సినిమాకు హోమ్ వర్క్ చేస్తాను. కొన్ని సినిమాల కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను. యాక్షన్ సన్నివేశాలు కూడా డూప్ లేకుండా చేస్తాను. 'నవరస' సిరీస్ చేసినప్పుడు కాస్ట్యూమ్ కారణంగా కొన్ని గంటలపాటు వాష్‌రూమ్‌కు కూడా వెళ్లలేదు. 'బహిష్కరణ'లో ఇంటిమేట్ సన్నివేశాలు చేసే సమయంలో అందరినీ బయటకు పంపి వాటిని చిత్రీకరించారు. అయినా ఆ సీన్ చేసే సమయంలో కొంచెం గందరగోళానికి గురయ్యాను. ఇప్పటివరకు ఇలాంటివి చేయలేదు. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మంచి సినిమా. నా పాత్రకు నేను ఎంతవరకు న్యాయం చేయగలను అనేది నా చేతిలో ఉంటుంది. సినిమా ఫలితం విషయంలో నేనేం చేయలేను. నా పాత్రకు అనుకున్నదానికంటే మంచి స్పందన వచ్చింది. 'సోషల్ మీడియాలో వచ్చే నెగెటివిటీ గురించి పట్టించుకోను. నా గురించి ఎవరైనా తప్పుగా రాసినప్పుడు చదివి బాధపడతాను. కానీ వెంటనే మర్చిపోతాను. ఇతరుల కోసం పనులు చేయడం మానేశాను. నా పెళ్లిపై కూడా ఎన్నో వార్తలు వచ్చాయి. అలా వస్తున్నాయని నేను పెళ్లి చేసుకోలేను కదా. సమయం వచ్చినప్పుడు చేసుకుంటాను' అని చెప్పారు.



# పంద్రాగస్ట్ సినిమాల విడుదల

**వరుస సెలవుల కారణంగా నిర్మాతల ఉత్సాహం**

ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విడుదలయ్యే సినిమాల సంఖ్య పెరుగుతోంది. ఆగస్టు 15న ఇండిపెండెన్స్ డే సెలవు రోజు. ఆ తర్వాత శుక్ర, శని, ఆదివారాలు. సోమవారం రాఖీ పండుగ కావటంతో నిర్మాతలు సినిమాల విడుదలకు మొగ్గుచూపుతున్నారు. తొలుత ఇదే తేదీన అల్లు అర్జున్- సుకుమార్ 'పుష్ప 2 ది రూల్' సినిమా విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అయితే రీ షూట్స్ కారణంగా ఈ సినిమా డిసెంబర్ 6కి వాయిదా పడింది. దీంతో చిన్న, మీడియం రేంజ్ బడ్జెట్ సినిమాలు ఆగస్టు విడుదలకు పోటీ పడుతున్నాయి. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. 2019లో ఇచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' మూవీకి ఇది సీక్వెల్. సంజయ్‌దత్ విలన్‌గా నటిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' మూవీ ఆగస్టు 15న విడుదల కానుంది. అలాగే నివేదా థామస్, ప్రియదర్శి ముఖ్యపాత్రల్లో నటిస్తున్న '35 ఇది చిన్న కథ కాదు' మూవీ కూడా అదే తేదీన విడుదల అవుతోంది. 'మ్యాడ్' సినిమాతో తెరంగ్రేటం చేసిన ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా వస్తున్న రెండో సినిమా 'ఆరు' కూడా అదే రోజున విడుదల అవుతోంది. తాజాగా ఈ లిస్టులోకి 'మిస్టర్ బచ్చన్' మూవీ కూడా వచ్చి చేరింది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ హీరోగా నటిస్తున్న సినిమా రూపుదిద్దుకుంది. బాక్సా ఫీసు వద్ద రామ్, రవితేజ ఇద్దరూ పోటీపడటం ఇది రెండోసారి. 2021లో రామ్ పోతినేని 'రెడ్' మూవీ, రవితేజ 'క్రాక్' మూవీ కూడా సంక్రాంతికే విడుదలై హిట్టుగానూ బ్లాక్ బస్టర్‌గా నిలిచాయి. కోలీవుడ్‌లో విక్రమ్ హీరోగా తెరకెక్కిన 'తంగలాన్' మూవీ కూడా ఆగస్టు 15నే విడుదలవు తోంది. మాళవిక మోహనన్ ముఖ్యపాత్రలో నటించారు.

Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154